# సాక్షి
## జగిత్యాల

శుక్రవారం । 10 । మార్చి । 2023




## పోలీసుస్టేషన్‌కు నారసింహుడు

- ప్రత్యేకపూజలు చేసిన పోలీసులు
- విజయవంతంగా దక్షిణ దిగ్యాత్ర
- దేశంలోనే అరుదైన సంప్రదాయం

- 8లో ▸

ధర్మపురి: దేశంలోనే అరుదైన సంప్రదాయం.. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దక్షిణ దిగ్యాత్రలో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించడం, ఎప్పటిలాగే ఈసారి కూడా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీలక్ష్మీనృసింహస్వామి పోలీసుస్టేషన్‌ను సందర్శించారు.



పూజలు అందుకుంటున్న నారసింహుడు

- అంబేడ్కర్ స్టేడియం సభ చారిత్రకం అవుతుందని ఆకాంక్ష
- కాంగ్రెస్ కవాతు సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- కదంతొక్కిన అభిమానులు
- హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు తరలివచ్చిన జనం
- కరీంనగర్ పవిత్ర స్థలమంటూ కొనియాడిన రేవంత్‌రెడ్డి
- యాత్ర ఫర్ చేంజ్ ఇక్కడి నుంచే ప్రారంభమన్న నేతలు
- బైబై కేసీఆర్ అంటూ సభా ప్రాంగణంలో ప్లకార్డుల ప్రదర్శన



కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, వేదికపై ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేలా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జైరాంరమేశ్, వీహెచ్, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ

- ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేలా మాట్లాడుతూ.. కరీంనగర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కరీంనగర్ గుర్తుకు వస్తుందని అని ప్రశంసించారు. తాము రైతు సంక్షేమానికి, గ్రామీణ వికాసానికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. తెలంగాణ వస్తే.. ఉపాధి అవకాశాలు వస్తాయని యువత పెట్టుకున్న ఆశలను బీఆర్ఎస్ నెరవేర్చలేదని వాపోయారు.
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం రూ.5 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో ప్రజలను నిండా ముంచారని అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని పాలించే అర్హతను కోల్పోయారని, కేసీఆర్‌ను రాజకీయ ఉరికంభం ఎక్కించబోయేది కరీంనగర్ కావాలని ఆకాంక్షించారు.
- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ మోడల్‌లో పాలన సాగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని కోరారు. కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ మరిచారని, కాంగ్రెస్ వస్తే నిరుద్యోగ భృతి, వరికి మద్దతు ధరతోపాటు బోనస్ ఇస్తామని స్పష్టం చేశారు.

# నాడు తెలంగాణ నినాదం..
# నేడు ఛత్తీస్‌గఢ్ విధానం

### మంత్రి గంగులపై చార్జిషీట్

అంతకుముందు మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి మంత్రి గంగుల కమలాకర్‌పై చార్జిషీట్ విడుదల చేశారు. నియోజకవర్గంలో భూ ఆక్రమణలు, మైనింగ్, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్: 2004 మార్చిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇస్తామంటూ అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హామీ ఇచ్చిన అదే అంబేడ్కర్ స్టేడియం మరోసారి కాంగ్రెస్ నేతల వాగ్దానాలకు వేదికైంది. గతంలో ఇక్కడే ఇచ్చిన మాట ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసినట్లే.. ఈసారి తాము అధికారంలోకి వస్తే.. రైతు, నిరుద్యోగుల అభ్యున్నతికి పాటుపడేలా ఛత్తీస్‌గఢ్ మోడల్‌ను అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలంతా ముక్తకంఠంతో హామీలిచ్చారు. చరిత్ర పునరావృతమవుతుందని, ఈ సభ చారిత్రకమవుతుందని కాంగ్రెస్ నేతలంతా ఆకాంక్షిస్తున్నారు. హాథ్ సే హాథ్ జోడో–యాత్ర ఫర్ చేంజ్‌లో భాగంగా గురువారం కరీంనగర్ నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. జై కాంగ్రెస్.. జై కాంగ్రెస్ అంటూ కార్యకర్తలు ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు. బైపాస్ రోడ్‌లో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ స్టేడియం వరకు సాగిన పాదయాత్రకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. పాదయాత్ర ఆసాంతం రేవంత్‌రెడ్డి జనానికి అభివాదం చేస్తూ, పలకరించుకుంటూ కొనసాగించారు.



కరీంనగర్‌లో రేవంత్‌రెడ్డి పాదయాత్ర

అనంతరం స్టేడియంలో కరీంనగర్ కవాతు పేరుతో నిర్వహించిన బహిరంగసభకు వేలాదిగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ప్రాంతంలో ఒక గొప్ప పవిత్ర స్థలం ఉంటుందని, కరీంనగర్‌లో అలాంటి గొప్ప పవిత్ర స్థలం అంబేడ్కర్ స్టేడియం అంటూ కొనియాడారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను గౌరవించి 2004లో ఇదే గడ్డపై తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ మాట ఇచ్చారని అన్నారు. తెలంగాణ సాక్షాత్కారం కావడంతో స్టేడియం తెలంగాణ తెచ్చిన పవిత్ర స్థలంగా మారిందన్నారు. వేములవాడ, కొండగట్టు పుణ్య క్షేత్రాలకు ఎంత ప్రాధాన్యత ఉందో.. ఈ స్టేడియానికీ అంతే ఉందని అన్నారు. 'మాట తప్పక మడమ తిప్పక.. సోనియా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు.. కానీ ఇచ్చిన రాష్ట్రం ఇవాళ ఎవరిపాలైందో మీరు ఆలోచన చేయండి' అంటూ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. తల్లిని చంపి పిల్లను బతికించారని మోదీ అవహేళన చేశారని, తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేని బీజేపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఇక్కడ గెలిచిన బండి సంజయ్ కూడా కరీంనగర్‌కు ఏం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, వి.హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యేలు వంశీ చందు, కొండా సురేఖ, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, చొప్పదండి నియోకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, అంజన్ కుమార్, పద్మాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సైనిక్ స్కూల్‌కు ఎంపిక


దైవిక్ మహదేవ్


హృతిక్ రెడ్డి


రణిత్

కోరుట్ల రూరల్: మండలంలోని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు ఎంపికయ్యారు. అలువాల దైవిక్ మహదేవ్, ఇప్ప హృతిక్ రెడ్డి, నలువాల రణిత్ సైనిక్ స్కూల్‌లో అర్హత సాధించారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

### రోడ్ల పనులపై సమీక్ష

జగిత్యాల: జిల్లా మీదుగా వెళ్లే రెండు జాతీయ రహదారుల పనులపై కలెక్టర్ యాస్మిన్ బాషా గురువారం రాత్రి అధికారులతో సమీక్షించారు. నంబరు 563 జగిత్యాల–కరీంనగర్, నంబరు 63 మంచిర్యాల – ఆర్మూర్ జాతీయ రహదారుల పనుల ప్రగతి గురించి ఆరా తీశారు. తహసీల్దార్లకు, వివిధ శాఖల అధికారులకు రోడ్ల పనులపై అవగాహన కల్పించారు. ఈనెల 31లో రోడ్ల పనులపై పూర్తి వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు.

### ఈనెల 11న రేవంత్‌రెడ్డి పర్యటన

మెట్‌పల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ నెల 11న కోరుట్ల నియోజకవర్గంలో పర్యటిస్తారని ఆ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రను విజయవంతం చేయాలన్నారు. నాయకులు జువ్వాడి కృష్ణారావు, జలపతి రెడ్డి, రా జు, అందె మారుతి, బెజ్జారపు శ్రీనివాస్ ఉన్నారు.

### వేలం వాయిదా

కొండగట్టు (చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం ఈవో వెంకటేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన దుకాణాల వేలం వాయిదాపడింది. కొబ్బరికాయల దుకాణం, కొబ్బరి ముక్కల సేకరణ, పూలు, పండ్లు, కిరాణం, ఆటవస్తువులు తదితర వాటికి ఏడాది కోసం వేలం నిర్వహించారు. దాదాపుగా 20 మంది టెండర్‌దారులు డీడీలతో హాజరయ్యారు. నిబంధనల్లో భాగంగా డీడీతోపాటు బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని ఉంది. టెండర్ దారులు డీడీలు తీయకుముందే ఈవోను సంప్రదించారు. టెండర్ వచ్చాక బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలి, పూర్తి డబ్బుచెల్లిస్తే గ్యారంటీ సైతం అవసరం లేదని తెలిపారు. స్థానిక సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మరికొందరు నిబంధనల ప్రకారం టెండర్ నిర్వహించాలన్నారు. దీంతో డీడీలు తీసినవారు నిరాశకు గురయ్యారు. గతేడాది కూడా ఒకేసారి నిర్వహించాల్సిన వేలం మూడు, నాలుగు సార్లకు ఫైనల్ అయింది. మరో 20 రోజుల్లో టెండర్ల గడువు ముగియనుందిఈనెల 16న బ్యాంక్ గ్యారంటీ లేకుండా డీడీలతో టెండర్లు నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

### గ్రామాల్లో తనిఖీలు

కథలాపూర్ : బొమ్మెన, చింతకుంటలో డీఆర్డీఏ విజిలెన్స్ అధికారి ప్రసాద్ గురువారం ఈజీఎస్ పనులు తనిఖీలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు పరిశీలించారు.

### చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీకి పసిపాప

ధర్మపురి: పట్టణానికి చెందిన ఓ మతిస్థిమితం లేని మహిళకు సుమారు మూడురోజుల క్రితం ఆడ శిశువు జన్మించింది. ఇప్పటికే ఓ కొడుకు, ఓ కూతురు ఉండగా, కూలీ పనులు చేసుకునే ఆ మహిళ.. మరో కూతురును సాకలేనని భావించి జగిత్యాలలోని చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులకు అప్పగించింది.

# మందుబాబుల ఆగడాలపై నిఘా

- అడ్డాగా మారుతున్న మామిడితోటలు, బహిరంగ ప్రదేశాలు


డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలజోన్ : మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్ట్ షాపులే దర్శనమిస్తున్నాయి. మామిడితోటలతో పాటు రోడ్లవెంట మందుబాబులు తిష్టవేయడం, తాగిన సీసాలను పగులగొట్టడం, ద్విచక్రవాహనాలపై హంగామా చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీస్‌శాఖ చర్యలకు ఉపక్రమించింది. ఎస్పీ భాస్కర్ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం నుంచి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేసేలా ఆదేశాలు జారీచేశారు.

**అడ్డాగా మామిడి తోటలు**

మందుబాబులకు మామిడితోటలు అడ్డాగా మారుతున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లలో చార్జీలు ఎక్కువగా ఉండటంతో సమీప గ్రామాలకు వెళ్లి విందు చేసుకుంటున్నారు. వైన్స్‌షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి మామిడితోటలు, రోడ్ల వెంట అడ్డావేస్తున్నారు. దీంతో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల చుట్టు పక్కలగ్రామాల మామిడి తోటల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది రైతులు మామిడితోటల్లో మద్యం తాగవద్దంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**రోజూ తనిఖీలు చేసేలా ఆదేశాలు..**

ఇటీవల మందుబాబుల ఆగడాలపై జిల్లా పోలీసులకు పలువురు ఫిర్యాదు చేయగా జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ భాస్కర్ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో విధిగా రోజూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జరిమానాలు కాకుండా జైలుకు పంపించాలని సూచిస్తున్నారు. గత నెల రోజుల్లోనే 690 మంది మద్యంతాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిపై ఐపీసీ 304 పార్ట్ 2 కింద కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. అయితే, ఇటీవల పోలీసుల నిఘా తగ్గడంతో యువకులు రోడ్లపై తాగుతూ, సీసాలు పగులగొడుతూ హంగామా సృష్టిస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునేలా పోలీసుశాఖ సమాయత్తమైంది. గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు.

**తరచూ ప్రమాదాలు**

మద్యంతాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో యువకులే మృత్యువాతపడడం గమనార్హం. తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు పోలీస్ శాఖ సిద్ధమవుతోంది. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో పట్టుబడిన మందుబాబులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పోలీస్ కళాబృందాల ద్వారా చైతన్యం తెస్తున్నారు.

> **కఠిన చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> మద్యంతాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల మామిడితోటల్లో అడ్డావేసి ఇష్టానుసారంగా మద్యం సీసాలు పగులగొడుతున్నట్లు తమదృష్టికి వచ్చింది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం.
>
> – భాస్కర్, ఎస్పీ

# పోలీసుస్టేషన్‌కు నారసింహుడు


దక్షిణ దిగ్యాత్రకు బయలుదేరిన స్వామివారు


తెప్పోత్సవంలో శ్రీవేంకటేశ్వరస్వామి

ధర్మపురి: దేశంలోనే అరుదైన సంప్రదాయం.. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దక్షిణ దిగ్యాత్రలో భాగంగా పోలీసుస్టేషన్‌ను సందర్శించడం. ఎప్పటిలాగే ఈసారి కూడా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీలక్ష్మీనృసింహస్వామి స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్‌కుమార్.. బ్రాహ్మణుల వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. తొలుత అశ్వవాహనంపై స్వామివారిని ఆశీనులను చేసి ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. దారిపొడవునా డీజే సౌండ్‌తో ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు ప్రదర్శించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారిని ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి కల్యాణం అనంతరం లక్ష్మీనృసింహుడు దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు చేస్తారని, ఈ క్రమంలోనే మార్గమధ్యలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలిస్తారని, కేసులపై ఆరా తీస్తారని, ఇది సనాతన సంప్రదాయమని వేదబ్రాహ్మణులు చెబుతున్నారు. దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించడం కోసమే స్వామివారు ఈ యాత్రలు చేపడతారని వివరించారు. ఇది ధర్మపురిలో తప్ప దేశంలో మరెక్కడా లేదని వారు చెబుతున్నారు. ఈకార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్ రెడ్డి, మంత్రి సతీమణి స్నేహలత పాల్గొన్నారు.

**వైభవంగా డోలోత్సవం**

నృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోనేరులో శ్రీవేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం జరిపించారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చారు.

## ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం కేసీఆర్ కూతురు కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం డిమాండ్ చేశారు. పెగడపల్లిలో గురువారం పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే కేంద్రం ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి దర్యాప్తు సంస్థలను బీఆర్‌ఎస్ నాయకులపై ఉసిగొల్పుతుందని ఆపార్టీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మండల బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు రామ్, నరేందర్, తిరుపతి, చందు, రాజు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

- డీఎస్పీ ప్రకాశ్


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

జగిత్యాల క్రైం: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ ప్రకాశ్ తెలిపారు. ఎస్పీ భాస్కర్ ఆదేశాలతో పట్టణంలోని గురువారం ఉదయం టీఆర్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్ లేని 71 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వారికి ఆశ్రయం ఇవ్వవద్దని సూచించారు. ఇక్కడ సీఐలు ఆరిఫ్ అలీఖాన్, కిషోర్, ఎస్సైలు అనిల్, రాము, మనోహర్ రావు, సంజీవ్, రహీం, చిరంజీవి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

### ‘రాయికల్’ ఇన్‌చార్జిగా శ్రావణి

రాయికల్(జగిత్యాల): బీజేపీ రాయికల్ మండల ఇన్‌చార్జిగా జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణిని నియమించారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కార్యకర్తలు సహకరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన కోరారు.

### ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలని కోరుట్ల డీఎల్పీవో శంకర్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 31లోగా వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. గ్రామాల వారీగా పంచాయతీ రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

### ఆరు ద్విచక్రవాహనాలు సీజ్

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లో ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై రాము తెలిపారు. ద్విచక్రవాహనాలకు ఎక్కువ ధ్వ ని వచ్చేలా సైలెన్సర్‌ను బిగించుకొని అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రజలు ఫిర్యాదు మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ద్విచక్రవాహనాలను పట్టుకున్నామని, వీటిని ఎంవీఐకి అప్పగిస్తామని తెలిపారు.

## తెలంగాణ యువత సినిమాల్లో రాణించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్ : తెలంగాణ యువత సినిమాల్లో రాణించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పన్నాల రాంరెడ్డి నిర్మాత, దర్శకుడిగా రూపుదిద్దుకున్న ‘నేడే విడుదల’ సినిమా పోస్టర్‌ను గురువారం పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ యువత తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్రనిర్మాత, దర్శకుడు పన్నాల రాం రెడ్డిని అభినందించారు. సినిమా ప్రేక్షకాదరణ పొంది సక్సెస్ కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మారు గంగారెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రతాపరెడ్డితో పాటు గ్రామానికి చెందిన పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఆలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని టీటీడీ ఇన్‌స్పెక్టర్ రామనాథం అన్నారు. మండల కేంద్రంతోపాటు పలుగ్రామాల్లోని ఆలయాలను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన గురువారం సందర్శించారు. టీటీడీ సభ్యుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చొరవతో ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మండలంలోని 15 ఆలయాల అభివృద్ధికి రూ.1.60కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీడీవో ప్రభు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు కాయితి శంకర్ ఎంపిక


కాయితి శంకర్

రాయికల్ : రాయికల్ పట్టణానికి చెందిన కాయితి శంకర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కాయితి శంకర్ బహుజనుల సమస్యల సాధన కోసం ఉద్యమించారని తెలిపారు. ఈ నెల 12న తిరుపతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు.

## మహిళా దినోత్సవం రోజే నోటీసులా?


మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాలజోన్: మహిళా దినోత్సవం రోజే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని, ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అని జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ప్రశ్నించారు. స్థానిక జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. మోదీ పాలనను సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్నందున, ఆయనను ఎదుర్కోనే సత్తా లేక, ఆయన కుమార్తెను వేధిస్తున్నారని విమర్శించారు. అదానీకి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రూ.కోట్లు దోచి పెట్టిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఎల్ సంతోష్ విచారణకు రాకుండా విదేశాల్లో తిరుగుతుంటే, రాజ్యాంగాన్ని గౌరవించే కవితకు నోటీసులు జారీచేయడం కక్ష సాధింపు చర్యలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ‘ధరణి’లో సవరణలు చేయాలని నేడు ధర్నా

కథలాపూర్(వేములవాడ): రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్న ధరణి పోర్టల్‌కు సవరణ చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి విమర్శించారు. సిరికొండలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధరణిపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తహసీల్ కార్యాలయాల ఎదుట శుక్రవారం రైతుదీక్ష నిర్వహిస్తామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరెడ్ల రవీందర్‌రెడ్డి, నాయకులు బద్రి సత్యం, గాంధారి శ్రీనివా స్, ఒడ్డాటి సునిల్, మహేశ్, సాయి పాల్గొన్నారు.

**రైతుల గోడు పట్టదా..?**

మల్లాపూర్(కోరుట్ల): రైతుల గోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా.. అని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. ముత్యంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం చక్కెర పరిశ్రమను తెరిపించాలనే డిమాండ్‌తో ఈనెల 10, 11న జిల్లాలో హాథ్ సే హాథ్ జోడోయాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు.

## అత్యాచారానికి యత్నించిన ఇద్దరికి రెండేళ్ల జైలు

జగిత్యాల జోన్/మల్యాల : మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన ఇద్దరిపై రెండేళ్ల జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కంచ ప్రసాద్ గురువారం తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం.. మల్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతుంది. జనవరి 14, 2013న అదే గ్రామానికి చెందిన పూడూరు శ్రవణ్ పని ఉందని చెప్పి బాలికను ఇంట్లోంచి తీసుకెళ్లాడు. బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి వెతుకుతూ సిర్ర హన్మవ్వ ఇంటివైపు వెళ్తుండగా సదరు బాలిక ఏడుస్తూ కనిపించింది. గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన బండ శేఖర్, హన్మవ్వ కొడుకు సిర్ర అనిల్ తనపై అఘాయిత్యానికి యత్నించినట్లు తెలిపింది. కుటుంబ సభ్యుల సహకారంతో మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ సీహెచ్ విద్యాసాగర్ కేసును మోదు చేసి బండశేఖర్, సిర్ర అనిల్‌ను అరెస్ట్ చేసి వారిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు జి.కిరణ్‌కుమార్, కేవీ సాగర్ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో ఇద్దరికి రెండేళ్ల జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు.

## గోదావరిలో నీటమునిగి ఒకరి మృతి


మృతిచెందిన లక్ష్మీ నారాయణ

మల్లాపూర్ : గోదావరినదిలో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మల్లాపూర్ మండలంలోని వాల్గొండలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చొప్పరి లక్ష్మీనారాయణ (45)కు భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు ఉపాధికోసం ఇటీవల గల్ఫ్‌కు వలస వెళ్లాడు. కాగా బుధవారం సాయంత్రం లక్ష్మీనారాయణ గ్రామ శివారులో ఉన్న గోదావరినదిలో స్నానానికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా నది వద్ద మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడి తల్లి చొప్పరి వెంకవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో ఒకరు..


అలకుంట నడ్పి రాజం మృతదేహం

ఇబ్రహీంపట్నం : మండలంలోని యామాపూర్ శివారులో విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన క్యా తం రాజరెడ్డి వ్యవసాయ పొలం వద్ద అడవిపందుల కోసం వేటగాళ్లు విద్యుత్ తీగలను అమర్చారు. కాగా వేటగాళ్లలో ఒకరైన అలకుంట నడ్పిరాజం అర్ధరాత్రి వేటకోసం క్యాతం రాజరెడ్డి పొలం వద్దకు వెళ్లాడు. కాగా విద్యుత్ తీగలు తగిలి నడ్పిరాజం అక్కడికక్కడే మృతి చెందాడు. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఉమాసాగర్, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్ రావు, ఏఈ సతీశ్, ట్రాన్స్‌కో సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి కుమారుడు అలకుంట శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

### పోగొట్టుకున్న పర్సు, సెల్‌ఫోన్ అప్పగింత

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుబ్బరాజన్న ఆలయానికి స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు పర్సు, సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ఆలయ ఉద్యోగి అందించి నిజాయితీ చాటుకున్నాడు. జగిత్యాల మండలం.. శంకులపల్లె గ్రామానికి చెందిన లక్ష్మణ్ పర్సు పోగొట్టుకోగా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన బండారి మహేశ్ సెల్‌ఫోన్ పొగొట్టుకున్నాడు. ఆలయంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న గన్నేరువరం రవికి దొరకగా వాటిని ఇరువురికి అప్పగించాడు. ఈవో కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య ఉద్యోగి రవిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పాంపర్తి మహేశ్, కొంగరి లింగారెడ్డి తదితరులున్నారు.

# పట్టుబడిన పగటి దొంగ

- రూ.1.20 కోట్ల సొత్తుచోరీ
- పోలీసులకు చిక్కిన వెంకటేశ్
- నాలుగేళ్లుగా దొంగతనాలు
- చోరీ సొత్తుతో ఆన్‌లైన్ గేమింగ్
- మణుగూరులో ఇళ్లు కొనుగోలు


నిందితుడితో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ, అధికారులు

గోదావరిఖని: నాలుగేళ్లుగా వరుస చోరీలకు పాల్పడిన నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. 72 దొంగతనాల్లో రూ.1.20 కోట్ల సొత్తు చోరీకి పాల్పడ్డాడు. 2.89కిలోల బంగారం, 4.07 కిలోల వెండి, రూ.19లక్షల నగదు ఎత్తుకెళ్లాడు. చివరకు గురువారం పోలీసులకు చిక్కాడు.. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి చోరీ వివరాలు వెల్లడించారు. సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు జిల్లా తక్కళ్లపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన రాజవరపు వెంకటేశ్(28) కొన్నేళ్ల క్రితం మంచిర్యాల జిల్లాకు వచ్చాడు. శ్రీరాంపూర్‌కు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుని సీసీ నస్పూర్ షిర్కేకాలనీ క్వార్టర్ 1145లో నివసిస్తున్నాడు. 2019లో మొదటి సారి చోరీకి పాల్పడిన వెంకటేశ్ ఇప్పటివరకు 72 చోరీలకు పాల్పడినట్లు సీపీ వివరించారు. చోరీలకు పాల్పడగా వచ్చిన సొమ్ముతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వినియోగించినట్లు వివరించారు. అంతేకాకుండా దొంగిలించిన ఆభరణాలను ముత్తూట్, శ్రీరాంఫైనాన్స్‌లో కొంత తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో మణుగూరులో ఇళ్లు కొనుగోలు చేసినట్లు వివరాలు వెల్లడించారు. పెద్దమొత్తంలో ధఫాబెట్ కోసం వెచ్చించినట్లు తెలిపారు.

**సెల్‌ఫోన్ ఫ్లైట్‌మోడ్.. పట్టపగలే చోరీలు**

చోరీచేసే ప్రాంతాన్ని ఎంచుకుని ఉదయమే సెల్‌ఫోన్ ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకుని బైక్ లేదా కారులో వెళ్తూ చోరీలకు పాల్పడుతుండేవాడు. రాత్రిళ్లు పోలీస్ పెట్రోలింగ్ ఉంటుందన్న భయంతో పగలే ఇళ్లకు కన్నం వేస్తుండేవాడు. ఇలా ఇంట్లో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారికి అనుమానం రాకుండా చోరీలకు పాల్పడినట్లు సీపీ వివరించారు. అయితే మధ్యలో కొన్ని రోజులు భవన నిర్మాణ పనులకు వెళ్లేవాడన్నారు. ఒంటరిగానే బైక్, బస్సుల్లో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడేవాడు. తాళం వేసిన ఇళ్లను గుర్తించి వెనకాల తలుపులు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. సీసీకెమెరాలు, జనసంచారం లేని ఇళ్లే టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరిగాడు.

**70కిపైగా చోరీలు**

పోలీసులకు చిక్కిన నిందితుడు వెంకటేశ్ రామగుండం పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో 70కి పైగా కేసులు నమోదయ్యాయి. గోదావరిఖని వన్‌టౌన్‌లో 14, నస్పూర్‌లో 7, లక్సెట్టిపేట్‌లో 6, చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో 7, మందమర్రిలో 11, రామక్రిష్ణాపూర్‌లో అత్యధికంగా 17, కాసిపేటలో రెండు, మంచిర్యాల శ్రీరాంపూర్‌లో ఒకటి, మంచిర్యాలలో ఐదు, బీమారంలో రెండు దొంగతనాలతో మొత్తం 72 చోరీ టలు చేసి రూ.1.20లక్షల విలువచేసే 2.89 కిలోల బంగారం, 4.07కిలోల వెండి, రూ.19లక్షల నగదు ఎత్తుకెళ్లాడు.

**చివరకు చిక్కిందిలా..**

గడిచిన నాలుగేళ్లుగా చోరీలకు పాల్పడిన వెంకటేశ్ గురువారం అనుమానస్పద స్థితిలో పోలీసులకు చిక్కాడు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వేలిముద్రలు సేకరించి ఫింగర్‌ప్రింట్ విభాగానికి పంపించారు. దీంతో 50కిపైగా చోరీల్లో ఇవే వేలిముద్రలున్నట్లు పోలీసులు గుర్తించారు. తమదైన శైలిలో విచారించడంతో చోరీలకు సంబంధించిన పూర్తివివరాలు వెల్లడించాడు.

**పోలీసులకు దొరకని సొత్తు..**

70కిపైగా ఇళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడిని పట్టుకున్నప్పటికీ సొత్తు మాత్రం దొరకలేదని సీపీ వెల్లడించారు. చోరీ సొత్తు ఆన్‌లైన్ గేమ్ దఫాబేట్ ఆడిపొగొట్టుకున్నాడని, కొంత బంగారం శ్రీరాంఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో ఆన్‌లైన్ గేమింగ్, జల్సాలకు వినియోగించాడని సీపీ వివరించారు. తిరిగి పోలీస్ కస్టడీకి తీసుకుని సొత్తంతా రికవరీ చేసేందుకు యత్నిస్తున్నామన్నారు.

**పోలీసులకు సీపీ అభినందన**

నాలుగేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న వెంకటేశ్‌ను పట్టుకున్న మంచిర్యాల పోలీసులను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అభినందించారు. డీసీపీ సుధీర్‌కేకన్‌రామనాథ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్సై రవికుమార్, ఉదయ్‌కిరణ్, ఏఎస్సై జితేందర్‌సింగ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, తిరుపతి, రవిని అభినందించి నగదు రివార్డులు అందించారు.